# మంచి వార్త

## వ్యర్థానికి అర్థవంతమైన రూపం



**సృజనాత్మక** దృష్టి ఉండాలే కానీ, వ్యర్థాల్లోనూ అర్థవంతమైన రూపాలను దర్శించవచ్చు అని నిరూపిస్తున్నాడు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన దేవల్ వర్మ. ఈ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్‌కు చిన్నప్పటి నుంచి కొత్తగా ఏదో చేయాలని ఉండేది. రీల్ అరిగిపోయిన క్యాసెట్లు, పాడైపోయిన ఎలక్ట్రిక్ స్విచ్‌లు, వాడి వదిలేసిన కరెంటు తీగలు అన్నిటినీ అపురూపంగా దాచుకునేవాడు. ఇలా చెత్త ఏరుకోవడం ఏంటని ఇంట్లోవాళ్లు తిట్టినా పట్టించుకునేవాడు కాదు. అలా సేకరించిన వ్యర్థాలతో అందమైన కళాకృతులను తయారుచేసేవాడు. బాల్యంలో మొదలైన ఈ అభిరుచి.. దేవల్ పెరిగేకొద్దీ మరింత రాటుదేలింది. ప్రముఖ టీవీ షో MAD (మ్యూజిక్, ఆర్ట్, డ్యాన్స్) ఆసక్తిగా చూసేవాడు అతను. ఈ కార్యక్రమం హోస్ట్ రాబర్ట్ స్ఫూర్తితో స్క్రాప్‌తో శిల్పాలు చేయడం మొదలుపెట్టాడు. అతని ఆసక్తిని గమనించిన పలువురు మెకానిక్‌లు.. తమ దగ్గర ఉండే వ్యర్థాలను దేవల్‌కు ఇస్తుండేవారు. వాళ్లు అభిమానంతో ఇచ్చిన వ్యర్థాలతో.. అందమైన మూర్తులను తీర్చిదిద్దేవాడు.

ఈ క్రియేటివ్ కుర్రాడు చదువుల్లోనూ రాణించాడు. ఇంజినీరింగ్ పట్టా అందుకున్నాడు. పూణెలోని ఎమ్ఐటీలో ప్రొడక్ట్ డిజైన్ కోర్సు చదివాడు. తర్వాత తన అభిరుచినే వృత్తిగా మలుచుకున్నాడు. మెటల్ స్క్రాప్‌తో విభిన్న రూపాలను తీర్చిదిద్దుతూ ఇండోర్‌వాసుల మనసులు గెలుచుకున్నాడు. ఈ క్రమంలో హార్లే డేవిడ్సన్ అధికారిక లోగోను స్క్రాప్‌తో మలిచి స్థానిక షోరూమ్‌కు కానుకగా అందించాడు. దేవల్ ప్రయాణం అక్కడితో ఆగిపోలేదు. ఆయన చేతుల్లో ప్రాణం పోసుకున్న మెటల్ స్క్రాప్ శిల్పాలు విదేశాలకూ చేరాయి. వివిధ దేశాల్లో ప్రదర్శనలకు నోచుకున్నాయి. దుబాయ్‌లో నిర్వహించిన మొదటి ప్రదర్శన దేవల్ శక్తిసామర్థ్యాలకు మైలురాయిగా నిలిచింది. సింగపూర్, ఇటలీ, అమెరికా నుంచి కూడా అతనికి ఆర్డర్లు వస్తుంటాయి. కస్టమర్లు కోరిన ఆకృతిని వాళ్లు ఊహించినదానికన్నా మిన్నగా చేసి అందరి ప్రశంసలూ అందుకుంటున్నాడు ఈ కుర్రాడు. మధ్యప్రదేశ్‌లోని ప్రముఖ నగరాలతోపాటు, దేశంలోని ఇతర పట్టణాల్లోనూ దేవల్ చేతిలో ప్రాణం పోసుకున్న స్క్రాప్ స్కల్ప్చర్స్ దర్శమిస్తాయి. ఉద్యానవనాల్లో, వీధి కూడళ్లలో దర్జాగా నిలిచిన బొమ్మలు.. దేవల్ క్రియేటివిటీకి మెచ్చుతునకల్లా కనిపిస్తుంటాయి.

## వైతాళికుల వాణి

ఎప్పుడైతే ప్రభుత్వం చేతులకు అమాయకుల నెత్తుటి మరకలు అంటుతాయో, అప్పుడు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాలు అపవిత్రం అయిపోతాయి.

• **మహాత్మా గాంధీ**

## క్యా సీన్ హై!

